# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్

3 | శనివారం 8 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


### రామగుండం సీపీగా
# అంబర్ కిశోర్ ఝా


బదిలీ పై వెళ్తున్న సీపీ శ్రీనివాస్


నూతన సీపీ అంబర్ కిశోర్ ఝా

మంచిర్యాల అర్బన్, మార్చి 7: రామగుండం పోలీస్‌కమిషనర్‌గా అంబర్ కిశోర్ ఝాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస్‌ను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సీఐడీ విభాగానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న అంబర్ కిషోర్ ఝాను ఇక్కడికి పంపిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాగా, రామగుండం కమిషనర్‌గా శ్రీనివాస్ 2024 ఫిబ్రవరి 12న ఇక్కడికి వచ్చారు. 13 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తనదైన శైలిలో కృషి చేశారు. రౌడీషీటర్లలో మార్పుకోసం వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆపరేషన్ డేకాయ్ కార్యక్రమాన్ని నిర్వహించి ఎందరో చిన్నారులకు మరో జీవితాన్ని అందించారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

# ఎంసీసీలో అగ్ని ప్రమాదం

- గోబర్ (బయో) గ్యాస్ ప్లాంట్‌పై వాడే ప్లాస్టిక్ క్యాప్స్ దగ్ధం
- మంటలు అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

మంచిర్యాల అర్బన్, మార్చి 7 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంసీసీలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఎంసీసీలో పల ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌కేజీఎస్ సంగ్ సంస్థకు సంబంధించిన గోబర్ గ్యాస్‌కు వాడే పై కప్పు ప్లాస్టిక్ క్యాప్స్ కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి.. దట్టంగా పొగ వ్యాపించింది. మంచిర్యాల అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో లీడింగ్ ఫైర్‌మెన్ అరుణ్‌కుమార్, డ్రైవర్ ఎంఏ రహీమ్, ఫైర్‌మెన్‌లు రాజేందర్, రమేశ్, శ్యామ్ సుందర్ ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. రూరల్ డెవలప్‌మెంట్ స్కీం కింద పశువులున్న రైతులకు గోబర్ (బయో) గ్యాస్‌ను ఉచితంగా నిర్మించి ఇస్తున్నామని, ప్లాంట్‌పైన వాడే పై కప్పులు కాలిపోయాయని నిర్వాహకులు తెలిపారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్నదానిపై ఫైర్ అధికారులను వివరణ కోరగా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. అనుమతులు లేకుండా ఇలాంటి ప్లాస్టిక్ ఫర్నీచర్ నిలువ ఉంచరాదని హెచ్చరించారు. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగినట్లు వారు తెలిపారు.


పాఠశాల అదనపు తరగతుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

వాంకిడి, మార్చి 7 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధచూపుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ప్రధానమంత్రి శ్రీ పథకంలో భాగంగా ఎంపికైన వాంకిడి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతుల నిర్మాణ స్థలాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు, తహసీల్దార్ రియాజ్ అలీతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ. 3.25 కోట్ల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి శివచరణ్ అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం సరిపోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# డీసీపీ భాస్కర్‌కు ఐపీఎస్ హోదా


మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాల అర్బన్, మార్చి 7 : మంచిర్యాల డీసీపీగా ఎగ్గడి భాస్కర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమార్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2019 బ్యాచ్‌కు చెందిన భాస్కర్ గ్రూప్-1 అధికారిగా పోలీస్ శాఖలో చేరారు. నాన్ క్యాడర్ డీసీపీగా 2024 జూన్ 20న మంచిర్యాల డీసీపీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2024 ఆగస్టు 14న స్టేట్ సర్వీస్ పూర్తి చేసుకోగా, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఐపీఎస్ హోదా కల్పించింది. ఐపీఎస్ హోదా పొందిన తర్వాత పోస్టింగ్ లేక పోవడంతో మంచిర్యాల డీసీపీగా ఉన్నతాధికారులు అటాచ్డ్ చేశారు. ఇక ఐపీఎస్ హోదాలో మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు అప్పగించారు.

# కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కన్నెపల్లి, మార్చి 7 : కీచక ఉపాధ్యాయుడిని సస్పెన్షన్ చేసినట్లు భీమిని ఎంఈవో రాధాకృష్ణ తెలిపారు. ఫిబ్రవరి 28న భీమిని మండలం జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రేగిపండ్ల రమేశ్.. అదే పాఠశాలలో చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేయగా, అతడిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.




## యాసంగిలో సాగు చేయలే

నాకు రాఘాపూర్ చెరువు కింద ఆరెకరాల భూమి ఉంది. యేటా యాసంగిలో చెరువుపై ఆధారపడి సాగు చేసేటోన్ని. ఈ ఏడాది చెరువులో నీళ్లు లేక మొత్తానికే పంటలేయలేదు. ఈ చెరువు కింద సాగు చేసిన రైతుల్లో కొందరు పంటలను పశువులకు వదిలేస్తున్నారు.

**-ఆడ లింగారావు, రైతు**




రాఘాపూర్ చెరువులో అడుగంటిన నీరు

# చెరువు నిండక.. పంటలు పండక

## నాడు వెయ్యి ఎకరాలకు సాగు నీరందించిన రాఘాపూర్ చెరువు

- నేడు 300 ఎకరాలకూ ఇవ్వలేని దుస్థితి
- గణనీయంగా తగ్గిన యాసంగి సాగు
- ఎండుతున్న పంటలను పశువులకు వదిలేస్తున్న రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ సిర్పూర్(యు), మార్చి 7 : నాడు వెయ్యి ఎకరాలకు సాగు నీరందించిన రాఘాపూర్ చెరువు.. నేడు కనీసం మూడు వందల ఎకరాలకూ భరోసా ఇవ్వలేని దుస్థితికి చేరుకున్నది. గతేడాది వర్షాలు సరిగా పడక చెరువు నిండక.. దీని కింద వేసిన పంటలు ఎండిపోతుండగా, వాటిని పశువుల మేతకు వదిలేయాల్సిన పరిస్థితి దాపురించింది.

**మరమ్మతులు లేక.. నీరందక..**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలంలోని రాఘాపూర్ చెరువు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద యేటా యాసంగిలో వెయ్యి ఎకరాల్లో పంటలు పండించేవారు. (వానకాలంలో ఈ చెరువు నీటిని వాడుకోరు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు తీస్తారు) కానీ, ఈ ఏడాది సుమారు మూడు వందల ఎకరాలే సాగు చేస్తున్నారు. ఆ పంటలు కూడా పూర్తిగా ఆరుతడి పంటలే కావడం గమనార్హం. వర్షాలు సరిగా పడకపోవడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో చెరువు కింద పంటలు వేయడం చాలా వరకు తగ్గించారు. చెరువు కాలువలకు ఆనుకొని ఉన్న కొంత మంది రైతులు మాత్రమే మూడు వందల ఎకరాల వరకు ఆరుతడి పంటలు వేశారు. కనీసం కాలువలకు మరమ్మతులు చేసి నీరందించాల్సి ఉండగా, పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇక చేసేదేమీ లేక రైతులు వాటిని పశువులకు వదిలేస్తున్నారు.


## రెండెకరాలు ఎండిపోయినయి

రాఘాపూర్ చెరువు కింద నాకు ఐదెకరాలు ఉంది. వానకాలంలో వర్షాధార పంటలే వేస్తా. యాసంగిలో మాత్రం రాఘాపూర్ చెరువు మీద ఆధారపడి సాగు చేస్తా. ఎప్పటిలాగే ఈ యాసంగిలో కూడా ఐదెకరాల్లో జొన్న వేసిన. చెరువు నీళ్లందక రెండెకరాలు ఎండిపోయినయి. గా పంటను పశువుల మేతకు వదిలేసిన.

**-కనక గోవింద్‌రావు, రైతు**





వదిలేసిన పంటలను మేస్తున్న పశువులు

# చెత్త వేయొద్దని చెబితే వినరా..?

- బెల్లంపల్లి మున్సిపాలిటీ నుంచి ఇక్కడికెందుకు తీసుకొస్తున్నరు
- ఎన్నిసార్లు అడ్డుకున్నా తీరు మారదా?
- పెద్దనపల్లి గ్రామస్తుల ఆగ్రహం
- సోమగూడెం వద్ద చెత్త వాహనాలను అడ్డుకొని రోడ్డుపై బైఠాయింపు

కాసిపేట, మార్చి 7 : 'బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తను సోమగూడెం పాతబస్తీ శివారులోకి ఎందుకు తీసుకొస్తున్నరు. ఎన్నిసార్లు అడ్డుకున్నా మీరు మారరా..' అంటూ పెద్దనపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బెల్లంపల్లి నుంచి వస్తున్న చెత్త వాహనాలను కాసిపేట మండలం సోమగూడెం పాత టోల్ గేట్ బ్రిడ్జి వద్ద అడ్డుకొని ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సోమగూడెం పాత బస్తీ శివారులో చెత్త డంప్ చేసి కాల్చడం వల్ల అనారోగ్యం పాలవుతున్నామని మండిపడ్డారు. ఇక్కడ చెత్త వేయమని అనుమతులెవరు ఇచ్చారంటూ ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మున్సిపల్ అధికారులు ఫోన్‌లో మాట్లాడగా అనుమతి పత్రం తీసుకొచ్చి చెత్త వేస్తామని, వాహనాలను అక్కడి నుంచి పంపాలని కోరగా, గ్రామస్తులు వినలేదు. మళ్లీ చెత్త తీసుకొస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆందోళన విరమించారు.


పాత సోమగూడెం బ్రిడ్జి వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు


ఎండకు రక్షణగా గొడుగు పట్టుకొని వెళ్తున్న యువతులు

# పగలు ఉక్కపోత రాత్రి గజగజ

*మంచిర్యాల జిల్లాలో వాతావరణంలో విభిన్న మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి వణికిస్తుండగా, పగలంతా ఎండతీవ్రతకు భగభగమండుతున్నది. ఉదయం 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మిట్ట మధ్యాహ్నం 35 నుంచి 38 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం ఏడింటి దాక పొగమంచు తొలగడం లేదు. రాత్రి పదింటి వరకే చలి తీవ్రత పెరుగుతున్నది. ఇక ఇటు చలికి.. అటు ఉక్కపోతకు ప్రజలు సతమతమవుతున్నారు. - నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, మంచిర్యాల*


ఉదయం పూట పొగ మంచు








